◆ న్యూజెర్సీ తెలుగు కళాసమితి 'ప్రజాపతి' ఉగాది కథల పోటీలో
రూ. 700/-లు ద్వితీయ బహుమతి పొందిన కథ

# ప్రమోషన్

సి.నరసింహా చార్యులు

అది ఆ ఊళ్ళో వున్న అతి చిన్న న్యాయస్థానం. గడియారం పది గంటలు కొట్టి అరగంట గడిచేసరికి, రకరకాల మనుషులతో - రకరకాల కేసులతో కోర్టు వాతావరణం అలముకుంది.

పొట్టకూటి కోసం వళ్ళు అమ్ముకొని కుళ్ళిపోయిన దిక్కులేని భారత పౌరులు - వాళ్ళ రక్తాన్ని జలగలలా పీల్చుకొనే ఎర్రటోపీలూ — జేబులు కొట్టే చిల్లర దొంగలూ, దార్లు కాసే దోపిడి దొంగలూ - వాళ్ళ నోళ్ళు కొట్టే కుర్ర ప్లీడర్లూ, పట్టపగలు నడి బజార్లో హత్యలు చేసే కిరాయి గూండాలూ, వాళ్ళకి దన్నుకాసే పెద్ద ప్లీడర్లూ —

ఇంకా ఎన్నో రకాలూ — వాళ్ళని వకీళ్ళకు తార్చి వాళ్ళ



ఫీజుల్లో కమీషను కొట్టే దళారులూ

జరిగింది జరగనట్టూ - జరగనిది జరిగినట్టు నిస్సంకోచం గానూ, నిర్భయం గానూ చెప్పే కిరాయి సాక్షులూ

తెలియనివాడిని కూడా బాగా తెలిసినవాడంటూ జామీను యిచ్చి విడిపించే స్టాకు ష్యూరిటీలూ —

అది ఓ బంగారు గని. అందులో తవ్వుకున్న వాడికి తవ్వుకున్నంత! పై కోర్టు తీర్పులే పారలూ, పలుగులూ. పెద్ద పెద్ద బైండు పుస్తకాలు చూపించి, హత్యని ఆత్మహత్యగానూ, ఆత్మహత్యని హత్యగానూ నిరూపించి మేడలు కట్టిన ప్లీడర్లూ —

తల నరికాడని కేసు పెడితే, వాడికి అస్సలు తలే లేదని నిరూపించి, వేలూ లక్షలూ సంపాదించిన ఉద్దండులూ.


వాళ్ళకి వత్తాసు పలికే వాళ్ళ గుమస్తాలూ - వీళ్ళని చూసీ చూడనట్టుగా సైదోడుగా నిలిచే కోర్టు గుమస్తాలూ - ఇవన్నీ 'చూడలేను మొర్రో' అంటూ కళ్ళకి గంతలు కట్టుకొని గోడకు అతుక్కుపోయిన న్యాయ దేవతా ...

మట్కా కేసు నుండి మర్డరు కేసు వరకూ ఆ కోర్టుకే వస్తాయి. చిన్న కేసులను మాత్రమే విచారిస్తుంది ఆ కోర్టు. పెద్ద కేసులను బంగీలుగా కట్టి పెద్ద కోర్టులకు పంపిస్తుంది, పెద్ద పోస్టాఫీసులా. ఆ చుట్టుపక్కల ఏ పెద్ద కోర్టులో నయినా ఏ కేసు నడవాలన్నా ఈ కోర్టు ద్వారానే వెళ్ళాలి. అందుకే అది ఏ నేరస్తులకయినా పుట్టిల్లు లాంటిది. అదీ ఆ కోర్టు ప్రత్యేకత.

అంతలో మేజిస్ట్రేటుగారు బెంచికి వచ్చినట్టుగా 'పబ్లిక్ కోర్టు' అంటూ ఓ కేక వినిపించింది. బయట జనం లోపలకు ఎగబడ్డారు. కుర్చీలు లాగిన చప్పుళ్ళు — కాకీల సెల్యూట్లు — వకీళ్ళ నమస్కారాలు — పార్టీల దండాలు— అన్నీ పూర్తి అయ్యాయి.

కోర్టులో పాతకాలంనాటి ఫ్యాన్ చప్పుడు తప్ప హాలంతా నిశ్శబ్దం అలుముకుంది. కేసు నెంబర్లూ, ముద్దాయిల పేర్లూ బెంచి గుమస్తా చెపుతూంటే బిళ్ళ బంట్రోతు పిలుస్తున్నాడు.

తెలుగు కళాసమితి న్యూజెర్సీవారు నిర్వహించిన కార్టూన్ల పోటీలో రూ.75/-ల బహుమతి పొందిన కార్టూను




"పి.పి. నూట మూడూ బై ఎనభై తొమ్మిది - మైఖేల్ జాని" అని బెంచి గుమస్తా చెప్పగానే, బిళ్ళ బంట్రోతు మూడు సార్లూ పిలిచాడు. పాతికేళ్ళు దాటుతున్న ఓ యువకుడు కోర్టు బయట చెప్పలు విడిచి, బయట నుంచే నమస్కరించుకుంటూ బోనులోకి వచ్చి పొందికగా నిల్చున్నాడు. మనిషిలో కంగారూ, గాభరా కన్పిస్తున్నాయ్ —

"ఏమిటి ఈ కేసు?" కొత్తగా చార్జీ తీసుకున్న మెజిస్ట్రేటుగారు అడిగారు.

"నాలుగు నెలల క్రితం నడి రోడ్డులో అప్పారావనే మొదటి సాక్షిని. కత్తితో పొడిచి స్వల్పంగా గాయపర్చాడు. సింపిల్ హర్ట్స్ విత్ డేంజరస్ వెపన్" అన్నారు పబ్లిక్ ప్రాసిక్యూటర్.

"కేసులో విచారణ పూర్తయిందిగా — ఇంక ఆర్గ్యుమెంట్స్ చెప్పండి" అన్నారు కోర్టువారు.

"యువరానర్ — ఈ కేసులో దెబ్బలు తిన్న మొదటి సాక్షి సాక్ష్యం తప్పితే, మిగతా సాక్షులు ఎవ్వరూ కేసుకు సపోర్టింగ్‌గా చెప్పలేదు. ఈ ముద్దాయి ఓ కిరాయి రౌడీ. వాళ్ళ గాంగ్ వాళ్ళే సాక్షులని భయపెట్టారు. యువరానర్ — ఇటువంటి కేసుల్లో సాక్షులు రారు. వచ్చినా సాక్ష్యం చెప్పరు. అందుకే నా మనవి ఒక్కటే. మొదటి సాక్షి సాక్ష్యం బట్టే ఇతనికి శిక్ష వేయవలసిందిగా కోరుతున్నా — లేకపోతే కిరాయి రౌడీలని అదుపు చేయడం చాలా కష్టం" అన్నారు పి.పి.గారు.

చివ్వుమని లేచారు డిఫెన్సు లాయరు. "ఒక్క సాక్షి సాక్ష్యాన్ని నమ్మి శిక్షించమనడం చట్టానికే విరుద్ధం. ఇంకా సాక్షులు వున్నారని ప్రాసిక్యూషన్ చెపుతోంది. అయినా ఏ ఒక్క సాక్షీ మొదటి సాక్షిని బలపరచలేదు. ప్రాసిక్యూటరుగారు 'కిరాయి రౌడీ' అంటూ వ్యాఖ్యానించారు. కానీ అందుకూ సాక్ష్యం లేదు. అది కోర్టువారి మనసును నా క్లయింటుకు వ్యతిరేకంగా 'తిప్పే ప్రయత్నం. అందువల్ల,ముద్దాయి 'బెనిఫిట్ ఆఫ్ డౌట్‌కి' అర్హుడు కాబట్టి ముద్దాయిని విడుదల చేయాల్సిందిగా నా ప్రార్థన" ఏకధాటిగా చెప్పారు ముద్దాయి లాయర్.

మెజిస్ట్రేటుగారు ముద్దాయి కేసి చూశారు. చాలా పొందికగా, బేలచూపులు చూస్తున్నాడు. మనిషిలో రౌడీ లక్షణాలు ఏమీ కన్పించడం లేదు. చూస్తుంటె జాలి వేస్తోంది.

ఒంటరి సాక్ష్యం బట్టి శిక్షించడం న్యాయం కాదు. పైగా మిగతా సాక్షులు 'వాడి సాక్ష్యం తప్పు' అంటూంటే — ఆ సాక్ష్యాన్ని ఎలా నమ్మటం?

కోర్టువారు ఆ రోజంతా ఆలోచించి, మర్నాడు తీర్పు చెప్పారు, కేసు కొట్టివేస్తూ. ముద్దాయి పదేపదే నమస్కరిస్తూ బయటకు నడిచాడు.

"కిరాయి రౌడీగాడు తప్పించుకున్నాడు" పి.పి.గారు కోర్టుకు వినిపించనంత నెమ్మదిగా గొణిగారు. డిఫెన్సు లాయరు ముసిముసిగా నవ్వారు.

* * *

నెలలు గడిచాయి — చాలా కేసుల్లో తీర్పులు వచ్చాయి. దోషులు కొంత మంది తప్పించుకున్నారు. కొంత మంది నిర్దోషులు ఇరుక్కుపోయారు. ఎప్పటిలాగే ఆ రోజూ కోర్టు ఆవరణ కిటకిటలాడుతోంది. నేరస్తులూ — ప్లీడర్లూ — పోలీసులూ — జామీన్‌దార్లు — సాక్షులూ — గుమస్తాలూ — అలవాటుపడిన ప్రాణుల్లా అక్కడకు చేరారు.

ఇంతలోనే వచ్చి ఆగింది ఓ పోలీస్ వాన్. కొద్ది రోజుల క్రితం పట్టణం నడిబొడ్డున — పట్టపగలు — పబ్లిక్‌గా జరిగింది ఓ హత్య — చచ్చింది ఇద్దరు — చంపింది ఒక్కడే! వాడే వీడంటూ ఆ వాన్లో తీసుకు వచ్చారు పోలీసులు

బాపు-రమణల పెళ్ళిపుస్తకం

జనం వేలంవెర్రిగా వచ్చారు, హంతకుడిని చూడడానికి! జనాన్ని అదుపుచేయలేక పోలీసులు నానా అవస్థా పడుతున్నారు. ఇంతలోనే ఓ అల వాటయిన అరుపు "పబ్లిక్ కోర్టు" అంటూ బయట సందడి కోర్టులోకి వెళ్ళింది.

కేసులు పిలవడం ఆరంభం అయింది. పిలిచిన వాళ్ళు లోపలకు వెడుతున్నారు. బయటకు వస్తున్నారు. ఆఖరి కేసు పిల్చారు —

"పి.ఆర్.సి. నాలుగూ బై తొంభై — మైఖేల్ జానీ" అన్నాడు బెంచి గుమస్తా. బిళ్ళబంట్రోతు ముమ్మారు పిలిచాడు అలవాటు ప్రకారం. 'వస్తున్నాడు' అంటూ హెడ్డు ఓ సంజ్ఞ పారేసి, వాన్ డోరు తెరిచాడు. మొదటగా నార్తు స్టార్ బూట్లు — తర్వాత మోకాళ్ళు — తర్వాత నడుం — తర్వాత తల — సినిమాలో పోష్ సోషల్ విలన్‌లా ఆ ఆకారం బయటకు వచ్చింది. ముద్దాయికి మూడు పదులు దాటలేదు. అమి తాబ్ బచ్చన్ క్రాఫ్. రాజశేఖర్ మీసాలూ — చిరంజీవి గెటప్ — హోదా పెరిగిన ఉద్యోగిలా హుందాగా దిగాడు.

"మైఖేల్ జానీ — మైఖేల్ జానీ" అంటూ గుంపులో గుసగుసలు. గర్వంగా చుట్టూ వున్న జనం కేసి చూశాడు. చిందరవందర జుట్టూ — బొడ్డుదాకా గుండీలు విప్పిన బాగీ చొక్కా — దండల వరకూ మడిచిన చొక్కా చేతులూ — మెళ్ళో గొలుసూ — ఠీవిగా, పొగరుగా నడుచుకుంటూ కోర్టు హాల్లోకి నడిచాడు.

మెజిస్ట్రేటుగారు తలెత్తి ముద్దాయి కేసి చూశారు. ముద్దాయి ఆయన కేసి నిర్లక్ష్యంగా చూశాడు. రెండు చేతులూ పాంటు జేబుల్లో పెట్టుకుని నిల్చున్నాడు. మేజిస్ట్రేటుగారికి ముద్దాయిని ఎక్కడో చూసినట్టుగా అన్పించింది. పాత కేసు జ్ఞాపకాలు ఆయన మనోయవనికపై నిలిచాయి. మెజిస్ట్రేటు గారికి చాలా ఆశ్చర్యం వేసింది.

పూర్వం, ఈ ముద్దాయే అతి చిన్న కేసులో వచ్చినప్పుడు ఎంత నమ్రత — అణుకువ — గౌరవం — భయం — కనిపించాయతనిలో. కోర్టు బయట జోళ్ళు విప్పాడు. కంఠం వరకూ గుండీలు పెట్టాడు. వచ్చిన దగ్గర నుంచీ వెళ్ళే వరకూ చేతులు మడిచి నమస్కరిస్తూనే వున్నాడు. ఎంత అమాయకుడో అప్పుడు —


కానీ ఇప్పుడూ! బొడ్డుదాకా బొత్తాలు పెట్టలేదు. దండల వరకూ చేతులు మడిచాడు. బూట్లు తొడిగాడు. మెడలో గొలుసు వేశాడు. మనిషిలో కోర్టు అంటే నిర్లక్ష్యం — ఏదో తెగింపు.

"నీ కేసు విచారణకు జిల్లా కోర్టుకు పంపుతున్నా — ఏమన్నా చెప్పకుంటావా?" కోర్టు వారు సౌమ్యంగా అడిగారు. "అక్కడే చెప్పకుంటా" సమాధానంలో పొగరు! కేసు పై కోర్టుకు విచారణకు పంపమని ఆర్డరు వేశారు —

ముద్దాయి మళ్ళీ వచ్చినంత దర్పంగా బయటకు నడిచాడు.

మెజిస్ట్రేటుగారికి ఆశ్చర్యం అలాగే వుంది. మహా అయితే మూడు నెలలు శిక్షపడే అతి చిన్న కేసులో ముద్దాయిగా వచ్చినపుడు ఎంతో నెమ్మది — అణకువా — కోర్టు అంటే గౌరవం — భయం, చూపెట్టాడు.

తెలుగు కళాసమితి న్యూజెర్సీవారు నిర్వహించిన కార్టూన్ల పోటీలో రూ.75/-లు బహుమతి పొందిన కార్టూను




మరణశిక్షగానీ — జీవిత ఖైదుగానీ పడే మర్డర్ కేసులో ముద్దాయిగా వచ్చినపుడు ఇంత నిర్లక్ష్యంగానూ, తెగింపుగానూ ఎందుకున్నాడు? పైగా వీడిలో ఈ గర్వం ఎందుకు తొంగి చూస్తోంది?

మెజిస్ట్రేటుగారికి అర్థం కాలేదు — కోర్టు హాలు ఖాళీ అయింది. మెజిస్ట్రేటుగారు వుండబట్టలేకపోయారు; పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ని నెమ్మదిగా అడిగారు.

"ప్రాసిక్యూటర్ - వీడిలో యీ తేడాని గమనించారా? వీడు చాలా చిన్న నేరానికి ముద్దాయిగా వచ్చినపుడు భయం భయంగా వున్నాడు. నమ్రత, వినయం వుట్టిపడ్డాయి. కానీ ఇప్పుడు — మర్డర్ కేసులో ఎక్కడా నదురూ బెదురూ లేదు — చూశారా, చిత్రంగా లేదూ?"

ప్రాసిక్యూటర్ నవ్వాడు ఓ వేదాంతిలా —

"యువరానర్ — నేను తమకి అప్పుడే చెప్పా వీడు కిరాయి రౌడీ అని. చిల్లర మల్లర దొంగతనాలతో జీవితం ప్రారంభించాడు. అప్పుడు పోలీసులు లాఠీలు ఝుళిపించేవారు. వాడికి సాక్షులని తిప్పకునే స్తోమత అప్పుడు లేదు. అందుకే కోర్టులంటే భయం. ఇప్పుడు వీడు కిరాయి గూండా. ఒక మెట్టు ఎక్కాడన్న మాట! పచ్చి నెత్తురు కళ్ళ చూస్తున్నా పోలీసులు వీడిపై పూర్వంలా లాఠీ ఝుళిపించలేరు. వీడి సహాయం కావలసిన పెద్దల అండదండలున్నాయ్ వీడికి. అందుకే ఏ మనిషీ సాక్షిగా రాడు - వచ్చినా చెప్పడు. వీడి సంపాదనా పెరిగింది. హోదా పెరిగింది. ఇప్పుడు వీడికీ ఓ గ్యాంగు.

"చిల్లర దొంగ నుంచి - కిరాయి రౌడీ - అక్కడ నుంచి కిరాయి గూండా - అలా తొండ ముదిరి ఊసరవెల్లి అవుతుంది! చూశారా జనాన్ని; సినిమా స్టారుకు మాదిరిగా వీడికీ 'స్టార్‌డమ్' పెరిగింది. అదీ వాడిలోని దర్పానికి కారణం — ఈ కోర్టు, ఈ కేసులో వాడికి ఏ శిక్షా వేయలేదు, పై పెద్ద కోర్టు తప్ప. బహుశా అక్కడ కూడా శిక్ష పడకపోవచ్చు. ముందుముందు వీడు రాజకీయ నాయకుడూ, ప్రజా నాయకుడూ కావొచ్చు..." అన్నారు విషాదంగా ప్రాసిక్యూటర్. "ఇందుకు న్యాయ వ్యవస్థదే లోపమంటారా?" అడిగాడు మెజిస్ట్రేటు. ప్రాసిక్యూటర్ ఆయన ముఖంలోకి చూశారు. అందులో నిజాయితీ తప్ప నిష్ఠూరం లేదు. "లోప మంతా న్యాయ వ్యవస్థదే అనలేము. సమాజంలో వున్న అన్ని లోపాల్నీ... అంటే అన్ని అవకాశాల్నీ ఉపయోగించుకుని వాడలా ప్రమాదకరమైన శక్తిని సంపాదించాడు."

ఇక మెజిస్ట్రేట్ మాట్లాడలేదు. ●

చూడండి పెళ్ళిపుస్తకం